# పెద్దకథ

[అలనాడు – అంటే ఎన్నో మిలియనుల క్రితం సాక్షాత్తూ శ్రీరామచంద్రులకు సీతాదేవితో వివాహం జరిగింది.

ఈ నాడు కాకుంటే – ఈ మధ్యన – మా వాసుదేవరావు పెళ్ళి సూర్యవెంకట సీతాలక్ష్మితో జరిగింది.

దానికీ, దీనికీ సంబంధం ఏమిటీ! – ఇప్పుడా గొడవంతా ఎందుకు?– అంటారేమో! ఉండండి మరీ – అందుకేగా ఈ కథంతాను.

ఈ రెండు పెళ్ళిళ్ళకూ కొద్దో గొప్పో సంబంధ ముంది మరి–

ఆ నాడు శ్రీరామచంద్రుల వారు శివుని విల్లు వంచి – చిట్లగొట్టి సీతమ్మ వారిని పెళ్ళాడారు కదా!–

కాక పోతే – మావాడు అంత సాహసం చెయ్యనందున వాళ్ళ నాన్నే ఇతగాడి వీపు వంచీ, చిట్లగొట్టీ, సీతాకల్యాణం జరిపించాడు.

ఈ చూపు వాసి తేడాకేముంది చెప్పండి?—]

వాసుదేవ పార్థసారథి నాకు బి. ఏ. లో క్లాస్‌మేట్ – శరీరాలు వేరయినా- హృదయాలు ఒక్కటే అన్నట్టు వుండేవాళ్ళం- దానికి తోడు మేమిద్దరం రూమ్ మేట్సుం కూడాను.

అప్పట్లో వాసుదేవరావు చాలా సన్నగా వుండేవాడు. ఉంగరాల జుట్టూ- బుగ్గమీద చిన్నసొట్టా చామన చాయకు ఓ పావు చాయ ఎక్కువగా-ఫర్వాలేదు-ఓ మాదిరి పెర్సనాలిటీతోనే వుండేవాడు. దానికితోడు "డ్రెస్" విషయంలో చాలా జాగ్రత్త తీసుకునేవాడు. ఎప్పుడూ మల్లెపువ్వులాంటి బట్టలు వేసుకుని టినోపాల్ ఏజంటులాగా వుండేవాడు.

ఇలా వుండగా ఏమైందీ–ఫైనల్ ఇయర్ చదువుతూండగా మావాడికి ఓ దుర్బుద్ధి పుట్టింది. అద్దంముందు అస్తమానూ తదేకంగా తనముఖాన్ని చూచుకోవడం ప్రారంభించాడు. అద్దంముందు "క్లోజప్"లో సన్నగా నవ్వుకొనేవాడు. ఇంకోసారి భావగర్భితంగా అర్థనిమీలిత నేత్రుడయ్యేవాడు. చాలాకాలం వరకూ నాకు మా వా డి బా ధ అర్థంకాలేదు. నిజానికి ఆ విషయమై నేను అంతగా ఆలోచించలేదు కూడా. ఉన్నట్టుండి – ఒకరోజున నావేపు తిరిగి ఉంగరాల జుట్టును షోగ్గా దు వ్వు కు ం టూ "గురూ! నేను అచ్చు (అక్కినేని) నాగేశ్వరావులా లేనూ?" అన్నాడు.

ఈ మాటలు వినగానే గతుక్కుమన్నాను నేను. ఇం కా న యం. గ్రిగరీ పెక్‌లా వున్నానన్నాడుకాదు. అనుకొని, "నీకేం గురూ? బ్రహ్మాండంగా వున్నావు. నాగేశ్వరావేం ఖర్మ — దేవానందుకూడా చాలడు—" అన్నాను ఫిల్మ్ ఫేర్ ముఖానికి అడ్డుగా పెట్టుకొని నవ్వాపుకొంటూ.

"నిజం?" అన్నాడు మావాడు మెర్లిన్ బ్రాండోలా నవ్వుతూ. వాడి నవ్వులో ఏదో గర్వం తొంగి చూచింది.

నవ్వుతూ అన్నాను – "అవునుగానీ – ఇంతకూ ఏంకథ?-చదువుమానేసి మెడ్రాస్ పేవ్‌మెంట్‌ల మీద మకాం పెడతావా?–"

"ఛ!- అదేం కాదు. నిన్న- ఆ కొంగ ముక్కు శారద లేదూ?" అన్నాడు సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ.

బద్ధకంగా వుండేమో – మంచంమీద దొర్లుతూ- పత్రిక పేజీలు తిరగేస్తున్న నాకు హఠాత్తుగా ఓ స ం చ ల న ం రేగింది. గొంతులో పది కప్పుల "టీ" (అయ్యర్ హోటల్ బాపతుది కాదు. అచ్చం నార్త్ యిండియన్ మేడ్) నా గొంతులో పడ్డట్టయింది. పత్రికను ఓ మూలకు గిరాటేసి మంచంమీద నించి లేచి కూర్చుని- "ఏవిఁటేవిఁటీ– "కథ మంచి పాకానికొచ్చిందే!" అన్నాను నవ్వుతూ.

శారద మా యి ల్లు గ ల వారమ్మాయి. సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా చాలా బావుండేది. చంద్రుడికో మచ్చంటారు చూడండి- అలా పాపం ఆ అమ్మాయికి పొడుగాటి ముక్కు పెట్టేసి భగవంతుడు ఆ అందాన్నంతా పాడుచేద్దామని తెగ తాపత్రయపడ్డాడు. కాని-పూర్ ఫెలో. ఓడిపోక తప్పలేదు. మేం ఈ రూమ్‌కి వచ్చిన రెండో రోజునించీ మావాడు ప్రేమదండకం ప్రారంభించాడు. "రేయ్! భాస్కరం_అందమనే మాటకు అర్థం ఏమిటని ఛాంబర్స్‌గాడు నన్నడిగితే ఏం చెప్పేవాణ్ణో తెలుసా?— పోవోయ్—దీనికింత గొడవెందుకు? — "శారద" అని రాసిపారేస్తే పోలా? అనేవాణ్ణి" అంటూ తెగవాగేవాడు. మావాడి సంఘ పేలాపన నాకలవాటే కాబట్టి నేనాట్టే పట్టించుకోలేదు ఇన్నాళ్ళూ. ఇప్పుడీ మాటలు వింటూంటే చెవొద్దూ-నాకూ కుతూహలమే కలిగింది.

నా మాటకు వాసు విజయగర్వంతో నవ్వుతూ—

"అబ్బ! అదే గురూ నీతో వ చ్చి ం ది. ఏదొచ్చినా అంతే. అ ం త కొ ం ప లే మీ అంటుకపోలేదు. తాపీగా చెబుతాగా ఉండు మరి" అంటూ జేబులు తడుముకోవడం ప్రారంభించాడు.

మావాడు సిగరెట్‌కోసం వెదుకుతున్నాడని గమనించి-

"ఉండుగురూ! అగ్గిపెట్టి, సి గ రె ట్టూ రెండూ నేను తెచ్చిస్తాగా – నువ్వు కదలకు మూడ్ పాడై పోతుంది" అంటూ పరిగెట్టుకెళ్ళి ఆ రెండు సామాన్లూ వాడి కందిచ్చాను.

సిగరెట్ ముట్టించి ఓ దమ్ము లాగి.

"ఊఁ! ఎంతవరకూ వచ్చిందీ మన కథా?" అన్నాడు వాసు కొంచెం పోజు పెడుతూ.

నాకు ఒళ్ళుమండింది. "నీ మొహందాకా వచ్చింది. ఇంతవరకూ నువ్వసలు కథ మొదలెట్టనేలేదు. ఏదో కొంగముక్కు- శారద అంటూ ఇందాక అఘోరించావుగా" అన్నాను కొంచెం కోపంగానే.

ఆమాట అనగానే వాడు నావైపు మండిపడుతూ చూచాడు.

"ఐ ప్రొటెస్ట్. నువ్వు ఇంకోసారి అలా కొంగ ముక్కూ- గింగ ముక్కూ- అన్నావంటే ఊరుకొనేదిలేదు–"

చిన్న సైజు "షాక్" తగిలినట్టుగా ఫీలయ్యాను.

"ఓరి దుర్మార్గుడా!- నువ్వే కదరా ఇందాక అలా అన్నదీ...." అన్నాను. సీరియస్‌గా మొహంపెట్టి. మావాడు అన్నాడు-

"నేనంటే మాత్రం నువ్వనాలని ఉందా? యిష్టంవుంటే "శారదా" అను- ఇంకా ఇష్టంవుంటే "సంపెంగ నాసిక శారదా" అను- అంతేగాని- కొంగ ముక్కూ-- బాతు ముక్కూ-- ఊరుకొనేది లేదు– ఆఁ!–"

కోపంగా అన్నాను నేను- "నాసికాలేదు త్రియంబకం లేదు. అసలు కథ చెప్పవోయ్–"

కొత్త పెళ్ళి కూతురులాగా సిగ్గుతో తల దించుకుని "మరి, – మరేంలేదు – ఆ సంపెంగ శారద వుందా?- మరి, ఆ శారదకి ఓ చెల్లెలువుందా?–మరి, ఆ చెల్లెలికి–" గొణుక్కుంటున్నట్టుగా చె బు తు న్నా డు వాసు.

"అవును. ఓ తమ్ముడు కూడా వున్నాడు. వాడితో వెరసి నలుగురికీ అమ్మా నాన్నా కూడా ఉన్నారు.–"

నా మాటలకు విసుక్కున్నాడు వాసు–

"నీ మొహం. ఉ ం టే ఉ న్నా ర్లే. ఇప్పుడు వాళ్ళ గొడవెందుకు? – మరేం – ఆ శారద చెల్లెలు నా దగ్గరకొచ్చి...."

"ఎవరూ?– ఆ ఎనిమిదేళ్ళ అమ్మాయా?" అన్నాను నవ్వాపుకుంటూ.

"ఊరుకోవోయ్. ఎనిమిదేళ్ళా ఎనభయ్యేళ్ళాసూ - నాకథకి అడ్డు రాకు...." అంటూ విసుక్కొని మళ్ళీ ప్రారంభించాడు "....నా దగ్గరకువచ్చి, మీ దగ్గర పత్రికలు ఏమున్నావుంటే యిమ్మని అడగమంది మా అక్క" అని చెప్పింది. వెంటనే గబగబా మన రూమ్‌లోవున్న పత్రికలన్నీ ఆ పాప చేతిలో పెడుతూ "పాపా-పాపా మీ అక్క యిదివర కెప్పుడయినా నన్నిలా పత్రిక లిమ్మని అడగమందా?" అన్నాను. దానికా పాప "అక్క మిమ్మల్ని ఎన్నోసార్లు పత్రికల గురించి అడుగుదా మనుకుందంటి- కాని,

# మా పెద్ది ప్రేమకథ

రామం



బాగుండదేమోఅని ఊరుకొంది అంది." దానికి నేను "అదేమిటమ్మా ఒక యింట్లో వుంటున్న తర్వాత ఒకరికొకరు ఆ మాత్రం సహాయపడకపోతే ఎలా? నా దగ్గరకు ఈ మా ప్రపంచంలోకి వచ్చే పత్రికలన్నీ వస్తాయి. నెలకి పాతిక రూపాయల పత్రికలు తెప్పిస్తాను నేను. ఆ పత్రికలన్నీ మా రూమ్మేటుగారు ఊరందరికీ దాన ధర్మాలు చేసేశారు. ఇకనించీ అవన్నీ నీకే

అంటే మీ అక్కకే ఇష్టాగా" అన్నాను సర్రున ఓ చిన్న సొరకాయ కోత కోస్తూ. "అలాగేనండి థాంక్స్" అంటూ ఆ పాప పత్రికలు తీసుకుని వెళ్ళి పోబోయింది. మరి కాస్సేపు ఆ పాపను నిలబెడుతూ అన్నాను నేను. "మరి మీ అక్క నిన్ను యిక్కడికి పంపించేటప్పుడు నా పేరు ఏమనిచెప్పింది? "వాసు" అందా? వాసుదేవరావు అందా?" దానికాపాప చక్రాల్లా కళ్ళు తిప్పుతూ "ఏమీ అనలేదండీ. క్రింద రూమ్‌లో నాగేశ్వర్రావు లాంటిఅబ్బాయి వుంటాడూ, అతన్ని అడిగి పత్రికలు తెమ్మందండీ" అంది.అంతేగురూ ఆనందంతో ఒక్కసారి గుండె కొట్టుకోవడం మానేసింది. తియ్యటి భావాలు బుర్రని ఘెరావ్ చేసేశాయి. పది గ్లాసులు మంచినీళ్ళు త్రాగితేగాని మళ్ళీ మనుష్యులలో పడలేదనుకో" అన్నాడు మా వాడు.


## కాయకల్ప చికిత్స

హృదయము వూపిరితిత్తులు, పైత్యకోశము పూర్తిగా శిథిలము కాకుంటే ఈ చికిత్స పొంద వచ్చును. 3 లేక 4మాసములలో ఈ చికిత్సవల్ల దేహములో నున్న అన్ని వ్యాధులు నివారణ మగుటయేగాక సగము వయస్సు కలిసివచ్చును. అనగా 60 సంవత్సరములవారు ఈ చికిత్స పొందిన 30 సంవత్సరముల ప్రాయములో వారికి వున్న యవ్వనము కలుగును. ఇంగ్లీషు అయుర్వేద యునాని హోమియోపతి ప్రకృతి వైద్యం వల్ల సాధ్యము కాని అన్ని వ్యాధులు నివారణమగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రెండు రూపాయలు పంపవలయును.

★

శ్రీ యోగాశ్రమము
పెదవాల్తేరు,
విశాఖపట్టణము—3.


వాసు మాటలు వింటున్న నాకు క్రమక్రమంగా "ఫ్లాష్‌బేక్" కథ అర్థం కావటం ప్రారంభించింది. ఇదివరలో నేను ఏదో ఒక వారపత్రిక కొంటే ఎందుకురా డబ్బులు దండగ— లైబ్రరీలో చదివితే పోలా, అని విసుక్కునే వాసు ఈ మధ్య అదేపనిగా బజారులో కనబడ్డ పత్రికలన్నీ కొనేస్తున్నాడు. ఆ మధ్య ఎవరినో అడిగి మా వూరికి రాని కొన్ని పత్రికల ఎడ్రసులు నోట్ చేసుకున్నాడు కూడాను. ఇదంతా చూసి పోనీలే పాఠాలు చదవకపోయినా— పత్రికలన్నా చదివి బాగుపడుతున్నాడుకదా అని సంతోషించాను కానీ— వెనుక యింత కథ వుందని ఊహించుకోలేకపోయాను.

ఇక— ప్రతిరోజూ తొమ్మిది అయ్యే సరికల్లా అంటే శారద మ్యూజిక్ స్కూల్‌కు వెళ్ళే టైముకి గుమ్మం దగ్గర కాచుక్కూచునేవాడు. ప్రతీరోజూ తొమ్మిది నిన్నర అయ్యాక స్నానంచేసి— అరగంట లేటుగా కాలేజీకి వెళ్ళే వాసు— ప్రొద్దున్నే స్నానం చేసి— నీట్‌గా టకప్ చేసుకుని ఎనిమిదిన్నర నించీ బీటుకాసే హడావిడిలో ఉండటం చూసి - కుర్రపక్షి ఏదో అవస్థపడుతున్నాడు అనుకున్నానుగానీ - వెనుక యింత కథుందని నాకేం తెలుసూ? శారదకు యిష్టమని కాబోలు మావాడు "క్లాసికల్ మ్యూజిక్" మీద టేస్టు కలిగించుకోవడం ప్రారంభించాడు ఈ మధ్యన. ఇదివరలో ఎప్పుడైనా పొరబాటున ఏ బాల మురళీకృష్ణ కచేరీయో ట్రాన్సిస్టరులో పెడితే కాలు కాలినట్టు గంతులేసి— "రామః రామః— ఇదెక్కడి నాయనమ్మ టేస్టురా?" అంటూ కేకలేసే వాసు - ఈ మధ్య అదే పనిగా సంగీత కార్యక్రమాలు వింటూ వుండటమూ—" అనుకుంటాంగానీ— ఒరేయ్, ఈ లప్పాం టప్పాం పాటల్లో జాతీయత లేదురా— ఈ కర్ణాటక సంగీతం వింటూ వుంటే వళ్ళు ఝల్లుమంటూ వుంటుంది, అందుకే ఎవడోగాని మా తెలివిగా అన్నాడురా "ఓల్డుఈజ్ గోల్డు" అని— అంటూ కామెంట్ చేస్తూండటమూ— పాల్ఘాట్ మణి అయ్యర్ దరువునూ, మధుర మణి అయ్యర్ గాత్రాన్ని-శారద వినేటట్టుగా మెచ్చుకుంటూ వుండటమూ-గమనించకపోలేదుగాని, అసలు విషయాన్ని పసిగట్టలేకపోయాను.

సిగరెట్ ఆఖరిదమ్ము లాగి కిటికీలోంచి విసిరేస్తూ—

"ఆశీర్వదించు గురూ-" అన్నాడు వాసు

"శీఘ్రమేవ ఈప్సితార్థ సిద్ధిరస్తు— అని ఆశీర్వదించాననుకోండి అది వేరే సంగతి.

హృదయ భారం తగ్గిందనుకున్నాడో ఏమో-ఆ రోజునించీ అస్తమానూ నాకు ఆ పిల్ల కబుర్లు చెబుతూండేవాడు. తనవైపు చూసి నవ్విందనో— తను గుమ్మం దగ్గిర కాయడం పొరబాటున ఆలస్యం అయితే—ఆ పిల్ల ఆలస్యంగా బయలుదేరిందనో— రకరకాలుగా ఉన్నవీ లేనివీ కలిపి చెబుతూండేవాడు. "కోతలు కోయుట" అనే విద్యలో డాక్టరేట్ పొందగల అర్హతవున్న వ్యక్తి అని తెలిసినందున— మొదటలో వాడి మాటలకు నేనాట్టే విలువ యివ్వలేదు.

ఇది ఇలా వుండగా— ఒక రోజున ఓ విచిత్రమైన సంఘటన జరిగింది ఆ రోజున మేము కాలేజీనించి కాస్త ఆలస్యంగా రూమ్‌కి తిరిగి వస్తున్నాం. దారిలో— సందుమొగలో శారద ఎదురైంది.

జరీ బోర్డర్‌వున్న నీలంరంగు పట్టుచీర. అదేరంగు జాకెట్ వేసుకుని తల్లో కనకాంబరం పూలు పెట్టుకొంది. పేరంటానికి వెడుతోంది కాబోలు అనుకున్నాను. ఇంతలో మావాడు శారదకు వినపడేటట్టు అన్నాడు నాతో. "వెధవ నీలంరంగు ఆడవాళ్ళ అందాన్ని చంపేస్తుంది. కనకాంబరం రంగు చీరకట్టుకుని లోలకులు, జడగంటలు పెట్టుకుని తల్లో నిండుగా ఆ కనకాంబరం పూలు పెట్టుకుంటే ఎంత బాగుంటుంది? తెలియాల్రాబాబూ. ఈ స్తటిక్ సెన్సు" అని.

ప్రక్కరోజు శారద సాక్షాత్తూ వాడు వర్ణించిన డ్రెస్‌తో సంగీతం స్కూలుకు వెళ్ళడం చూసేను. ఆ రోజున నన్ను వాడు కావలించేసుకుని మలబార్ హోటల్లో మైసూర్ కాజా, బొంబాయి హల్వా యిప్పించాడు. నాకింకా జ్ఞాపకముంది. "ఫర్వాలేదు మనవాడు దోవలో పడుతున్నాడు" అనుకున్నాను నేను.

ఏది ఎలావున్నా-పత్రికల రవాణా యధాప్రకారంగా జరిగిపోతూండేది. పత్రికలు తీసికెళ్ళడానికి వచ్చిన పాపకి మా వాడు క్రీమ్ బిస్కట్లు వగైరా కూడా యిస్తూండేవాడు. "ఇదెక్కడి పిచ్చిరా?"అంటే "నీకు తెలియదురా బాబూ, ఈ 'కాకా' అనే పదార్థం అన్ని లెవెల్సులోనూ వుండాలి" అనేవాడు. ఇదెంతవరకూ నిజమోగాని, మా వాడి 'కాకా' ధర్మమా అని ఓసారి ఒక బ్రహ్మాండమైన రహస్యం బయటపడింది.

ఒకరోజున క్రీమ్ బిస్కెట్‌ను పాప చేతికిస్తూ మా వాడు—

"అవునుగానీ మీ అక్కకు ఆ "తరానా" సంగీతం అంటే భలేయిష్టం కదూ? ఎప్పుడూ ఆ సంగీతమే పాడుకుంటూ వుంటుంది కదూ?— నాకూ ఆ సంగీతమంటే భలేయిష్టం. అసలాకచేరీలు వినడం

కోసమే రేడియో కొన్నాను. హా-హా-హా-" అన్నాడు.

ఆ మాటలకా పాప ఫక్కున నవ్వి-

"భలే వారండీ. మా అక్కకు సంగీత మంటే చెడ్డ తలకాయ నొప్పి. సినిమా పాటలంటే భలేయిష్టం, అందులో నూ "సంగమ్" సినిమాలో పాటలంటే మరీనూ "

ఈ మాటలు వినగానే మా వాడు నిశ్చేష్టుడైపోయాడు. కొంతసేపటివరకూ మాట పెగల్లేదు, అంతలోనే తేరుకొని-ఎలక్షన్‌లో డిపోజిట్ పోగొట్టుకున్న అభ్యర్థిలా మొహం పెట్టి—

"మరయితే ఈ "తరానా" సంగీత మంటే మీ అక్కకు అస్సలు ఇష్టం లేదా?" అన్నాడు పేకెట్లోంచి మరో రెండు మంఘూరామ్ బిస్కెట్లు తీసి పాపకిస్తూ-పాప మాటల్ని అంత త్వరగా నమ్మలేక పోతున్నాడు వాసు.

క్రీమ్ బిస్కెట్ షోగ్గా కొరుకుతూ—

"అబ్బే అదంటేనే మా అక్కకు డోకండీ.-మీరు అస్తమానూ ఆ ట్రాన్సిస్టర్‌లో "సరిగమపదనిసా" పాటలు వింటూంటే-మా అక్క వినుక్కునేదండీ. మరండీ ఓసారి మా అక్క మిమ్మల్ని...." అని చటుక్కున ఆగిపోయింది పాప—

ఏదో రహస్యం వుందని గమనించిన వాసు-గభాల్న బిస్కట్ పేకట్ అంతా పాప చేతిలో పెడుతూ - "మీ అక్క నన్నూ?-" అన్నాడు ఆతృతగా-

"ఏమీ లేదండీ- ఓసారి మా అక్క మిమ్మల్ని "నాయనమ్మ బుద్ధుల మనిషి" అందండీ-"

దాంతో మావాడు షాక్ తిన్నట్టుగా ఫేల య్యాడు. అయినా- తమాయించుకుని-


"ఎందుకని?" అన్నాడు రోషంగా.

"మరి- రేడియోలో ఎప్పుడూ ఆ పాటలే వింటూంటారుగా మరి?-" నవ్వుతూ అంది పాప.

"ఉహూఁ! నేను ఆ సంగీతం వింటేనే నాయనమ్మను అయిపోయాను అందికదా! మరి ఆ సంగీతం రోజూ సాధకం చేస్తూంటుందిగా మీ అక్క. నాకన్నా పెద్ద నాయనమ్మ అవుతుంది" అన్నాడు కోపంగా.

"మా నాన్నగారి పోరు పడలేక ఆ పాటలు పాడుకుంటూ వుంటుంది మా అక్క. ఆ పాటలు పాడకపోతే కోప్పడతాడు నాన్న. ఆడపిల్లలన్నాక సంగీతం కాస్తో గొప్పో రావాలిట కదండీ" చక్రాల్లా కళ్ళు తిప్పుతూ అంది పాప.

ఈ మాటలు వినగానే వాసు ఎంతగానో ధపడిపోయాడు.




ఇన్నాళ్ళూ తను శారదని అపార్థం చేసుకున్నందుకు నొచ్చుకున్నాడు. ఆ క్షణంతో వాడికి చిన్నల అభిరుచులమీద పెత్తనం చెలాయిస్తున్న పెద్దలమీద వల్లమాలిన కోపం వచ్చింది. అయినా అదంతా తమాయించుకొని భారంగా నిట్టూరుస్తూ.

"పాపా! నాకో చిన్న సహాయం చేసి పెడతావా?" అన్నాడు వాసు.

"ఓ! చెప్పండి ఏం కావాలో."

"మరేమీలేదు. మీ అక్కతో నాకు హిందీ సినిమా పాటలంటే భలేయిష్టమని చెబుతావా?. నేనెప్పుడూ బాత్‌రూమ్‌లో కూర్చుని "బోల్‌రాధా బోల్ సంగమ్" అని పాడుకుంటూ వుంటాననీ-అందువల్లే నాకు స్నానం ఆలస్యమవుతుందనీ చెబుతావా?-ఆ "తరానా" సంగీతమంటే మా రూమ్‌మేట్‌గాడు లేడూ?-వాడు చెవి కోసుకుంటాడు. వాడివన్నీ నాయనమ్మ బుద్ధులే. వాడిపోరు పడలేక బెజవాడ వింటూంటాను. అంతే నన్ను అపార్థం చేసుకొంది మీ అక్క. ఇకనించీ ఎప్పుడూ ఆ శంకర్ జైకిషన్ సంగీతమే వింటుంటానని చెప్పడం మరచిపోకేం?-" గబగబా అంటున్నాడు వాసు.

నవ్వుతూ అంది పాప-"అలాగేలెండి-వస్తాను "

వాడి అవస్థ చూస్తూంటే నాకు నవ్వొచ్చింది. నావి నాయనమ్మ బుద్ధులన్నాడని వాడిమీద నాకు కోపంలేదు. ఎందుకంటే - చాలా కాలంగా వాడు నా గుండెలో బోలెడంత స్నేహాన్ని దాచుకున్నాడు.

పాప వెళ్ళిపోయిన తర్వాత తల పట్టుకుంటూ గొణుక్కున్నాడు వాసు-

"అనవసరంగా నా శారదను అపార్థం చేసుకున్నానురా. ఆ మీసాల రావు గాడు ఇంత పన్నాగం పన్నాడనుకోలేదు-" అంటూ బావురు మన్నాడు.

ఇంతా చెప్పాక మీసాలరావు గారి గురించి చెప్పకపోవడం అన్యాయం మీసాలరావు శారదకు సాక్షాత్తూ తండ్రి సార్థక నామధేయుడైన మీసాల రావు - తన మీసాలకు తగ్గట్టుగా సర్కిల్ యిన్‌స్పెక్టర్ ఉద్యోగం చేస్తున్నా బుద్ధుల్లో మాత్రం కాస్త వైవిధ్యం చూపించుకున్నారు.

నిజానికి- మీసాలరావంటే తెలియని వాళ్ళు- అతడి మోటారు సైకిలు ఎరగని వాళ్ళూ మా పేటలో ఎవరూ లేరు. సంగీత ప్రియుడైన మీసాలరావు ఎప్పుడూ తనలో తాను సంగీత ధ్వనులు చేసుకొంటూ వుండటమూ- మోటారుసైకిలు ధ్వనుల్లో తను లయవిన్యాసాలు ఊహించుకుంటూ వుండటమూ ఎరిగిన ప్రజలు అతగాడి గుర్రం ఎవరిమీద ఎక్కేస్తుందో అన్న భయంతో బిక్కచచ్చిపోయి నడుస్తూండేవాళ్ళు రోడ్డు మీద.

అయినా సరే- జనాన్ని అంత తేలికగా విడిచిపెట్టేవాడు కాదు మీసాలరావు. రోడ్డు మీద ముఖ పరిచయం వున్నవాళ్ళు కనబడితే చాలు- గంటలతరబడి నిలబెట్టేసి దిగజారిపోతున్న సంగీత విలువల గురించీ—

ఈనాటి విద్యార్థుల నేలబారు సంగీతాభిరుచి గురించీ-గంటల తరబడి లెక్చర్లిచ్చేవాడు. అలాంటి మీసాలరావుకు మా వాసు ఆప్త మిత్రుడయ్యాడు. "ఈ తరంలో వుండాల్సిన కుర్రాడివి కాదోయి నువ్వు. ఈ రోజుల్లో ఏ స్టూడెంటుకి వుంది ఇలాంటి టేస్టు" అంటూ మీసాలరావు మా వాడి సంగీతాభిరుచిని తెగ మెచ్చుకొనేవాడు. ఇది చూసి మావాడు రెచ్చిపోయి అస్తమానూ వచ్చీరాని కోతలు తెగ కోస్తుండేవాడు.

నాతో కూడా అన్నాడు వాసు ఒకటి రెండు సార్లు, "తండ్రీ కూతుళ్ళిద్దరి ఉేస్టులూ ఒకటే: అందుకే శారద అంత శ్రద్ధగా సంగీతం నేర్చుకొంటోంది" అని 'కామోసు' అనుకున్నాను నేను. కాని- మీసాల రావు బుద్ధి ఇలాంటిదని ఊహించలేక పోయాను.

మా వాసు అవస్థచూస్తోంటే ఏడవాలో నవ్వాలో తెలియలేదు నాకు. అయినా ధైర్యం చెబుతూ.

"ఫర్వాలేదు వాసూ! బెంగపెటుకోమాకు అపోహలూ, అపార్థాలూ, లేకుండా ప్రేయసీ ప్రియులు ప్రేమించుకోవడం నేను ఏ సినిమాలోనూ చూడలేదు. ఈ బాలారిష్టాలన్నీ తొలగిపోతేగాని ప్రేమ గట్టిగా నిలదొక్కుకోదు" అంటూ ఓదార్చాను.

ఏదో అలా గడిచిపోయిందా రోజు. కాని మావాడి గుండెల్లో ఏదో వ్యధ పీకుతూనేవుంది. శారద తననీ, తను శారదనీ ఇలా అపార్థాలు చేసుకోకుండా ఒకకామన్ అండర్‌స్టాండింగ్‌కి వస్తేగాని - తమ ఈ ప్రేమ వ్యవహారం విజయవంతం కావడం అసంభవం అంటూ వెయ్యిమంది ప్రేమ జీవులు వాడి గుండెల్లో గగ్గోలుపెట్టడం ప్రారంభించారు. ఇక-అందుకు వాడికి ఒకే మార్గం కనబడింది.

వాసు ఓ రోజున అన్నాడు నాతో—

"గురూ!-ఇక లాభం లేదు. శారద నన్ను ప్రేమిస్తోంది. నేను శారదను ప్రేమిస్తున్నాను. ఇక దాపరిక మెందుకు? నా హృదయాన్ని తివాచీలా పరిచేస్తాను. ఈ సారి పత్రికలు ఇచ్చినప్పుడు అందులో ఘాటయిన ప్రేమలేఖ పెట్టేస్తాను. ఎంత చెడ్డా నువ్వు కవిగాడివి కాబట్టి-కాస్త ఓ మంచి ప్రేమలేఖ నాకు బదులుగా రాసిపెడుదూ- నీకు పుణ్యం వుంటుంది."

ఈ మాటలు వినగానే గతుక్కుమన్నాను నేను.

"ఒరేయ్!" ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యమాకు. వాళ్ళ నాన్న మీసాల రావు సంగతి సరిగ్గా తెలియదేమో నీకు. మర్యాదగా వున్నంతసేపూ త్యాగరాజు, శ్యామశాస్త్రి, అంటాడు తిక్క రేగిందంటే నీ బుర్ర మీద పాల్ఘాట్ మణి అయ్యర్ మృదంగ వాయిద్యం వినిపిస్తాడు. ఇలాంటి వెధవ్వేషాలు వేస్తున్నావనితెలియగానే- దేహశుద్ధి చేసి యింట్లోంచి తగిలేస్తాడు బ్రతికుంటే బలుసాకు తినొచ్చు. ప్రేమకోసమై బలైపోకురా-" అని నేను నయానా భయానా ఒప్పించాను.

నా మాటలమీద కొద్దో గొప్పో గౌరవమున్నందునా- హీరోయిన్ తండ్రి మీసాలరావంటే అతగాడికి భయభక్తులున్నందునా- తన దేహంపై అపారమైన గాఢానురాగం వున్నందునా - ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించాడు వాసుదేవరావు.

ఇంతలో కాలేజీకి సంక్రాంతి సెలవలివ్వడం ఇద్దరమూ యిళ్ళదోవ పట్టడమూ జరిగింది. సెలవులయిపోయాక రాజమండ్రీ తిరిగి వచ్చేసరికి బస్‌స్టాండులోనే వాడు నాకు ఎదురయ్యాడు. ఎప్పుడూ కాలేజీ తీసిన వారం రోజులకుగాని రాని వాసు ఇంత త్వరగా రావడం- అందునా, నాకు బస్‌స్టాండులోనే స్వాగతం చెప్పడం బాగా ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"ఏమిట్రోయ్?- పద్ధతి మార్చేశావు?- ఎప్పుడు రాక?-" అన్నాడు ఉషారుగా.

దానికి వాడు సమాధానం చెప్పక దేవదాసులా తలాడించాడు. వాడి పేతటిక్‌పోజు చూస్తే నాకు వళ్ళు మండింది. మళ్ళీ వీడేదో ఘనకార్యం చేసి వుంటాడనిపించింది, రిక్షా కదులుతూండగా అన్నాడు వాసు.

"శారదకు పెళ్ళి నిశ్చయమైంది. ఎల్లుండి పెళ్ళి"

నిజం చెప్పొద్దూ నాకు ఈ వార్త షాక్ లాగానే అనిపించింది.

"ఎవరు చెప్పారు? మీసాలరావు అన్నాడా?" అన్నాను.

"ఒకళ్ళు చెప్పడమెందుకు? పబ్లిగ్గా ప్రింటయిపోతేనూ" అంటూ సీరియస్‌గా ఓ శుభలేఖను నా ముందుకు తోశాడు.

వాడి మాటల్లో నాకు కోపంధ్వనించింది. తన ప్రేమ సముద్రానికి ఆనకట్ట కట్టాననీ "రెడ్ టేపిజమ్"ను వాడి ప్రేమకు లుంగ చుట్టాననీ ఫీలవుతున్నాడు వాసు. వాడి మనసులోని బాధ నాకు తెలుసు. అయ్యినా ఏమి మాట్లాడలేక పోయాను.

రాత్రి పడుకోబోతూండగా అన్నాడు వాసు.

"ఒరేయ్ భాస్కరం! నువ్వు నమ్మితే నమ్ము. లేకపోతేలేదు. మావి మూగమనసుల్రా. మేమిద్దరం ఒకళ్ళనొకళ్ళం ప్రేమించుకున్నాం. అయినా మా ప్రేమను విప్పి చెప్పుకోలేకపోయాం. మా ప్రేమ ప్రవాహానికి నువ్వూ, ఆ మీసాలరావూ కరటక దమనకుల్లా అడ్డొచ్చారు. మీవి గుండెలు కాదురా. బండలు. రేయ్! మిమ్మల్నేంచేసినా పాపంలేదు."

వాడి బాధచూస్తే జాలేస్తోంది. సెలవలు ఇంకా వుండగానే-ఇంట్లో వుండలేక-శారద దర్శనం కోసమని రాజమండ్రి వచ్చిన వాసు ఇంటిముందర పెళ్ళి పందిరినీ-పత్రికలకొచ్చిన పాప చేతిలో ఇన్విటేషన్‌నీ చూసి మెంటల్ షాక్ తిన్నాడు. వాడిని ఇప్పుడు ఏమన్నా లాభంలేదు. బాధగా కళ్ళు మూసుకున్నాను నేను.

ఫెళ్ళుమంటూ పెళ్ళి ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. మీసాలరావుగారు ఓవైపు త్యాగరాజ కీర్తనలను కూనిరాగాలుగా తీస్తూనే మరొకవైపు పెళ్ళి ఏర్పాట్లు చేయించేస్తున్నారు. పోలీసు కాన్‌స్టేబుల్స్ స్వయానా తమ ఇంట్లో పెళ్ళిలాగా హడావిడిగా పనిచేస్తున్నారు. నీళ్ళమోత-వంట ఏర్పాట్లూ చూస్తున్న కాన్‌స్టేబుల్ని గుర్తుపట్ట గలిగాను, చాలా కాలం క్రితం వాడు మా వాసుని లైట్ లేకుండా సైకిల్ తొక్కుతున్నందుకు పట్టుకున్నాడు కూడాను.

ఏది ఏమైనా- ఈ హడావిడంతా మా వాడు పట్టించుకునే స్థితిలో లేడు.

తెల్లారితే పెళ్ళనగా చివరి కన్నీటి బొట్లను తుడుచుకుంటూ అన్నాడు వాసు. "శారదకు ఏం ప్రెజంటేషన్ యిస్తే బాగుంటుందిరా?-"

"పెళ్ళి కానుకా?-"

"కాదు. ప్రేమ కానుక-"

ఓ క్షణం ఆలోచించాను నేను.


"ఈ బాపతు వ్యవహారాల్లో గులాబీ పువ్వు కానుకగా యిస్తారని విన్నాను. మొన్న ఆ మధ్య ఏదో సినిమాలో బంతి పువ్వు కూడా దోషం లేదన్నాడు. మార్కెట్ జంక్షన్‌లో అయితే సాయిబుకొట్టు దగ్గర మంచి గులాబీ పూలు దొరుకుతాయి -" అన్నాను నేను.

నా మాటలకు వాడు మండిపడ్డాడు.

"పోరా- నాయనమ్మా!- నా ప్రేమను గులాబీపూలతో కొలుస్తావట్రా?-" అన్నాడు బాధగా గుండెల్ని అదుముకుంటూ.

(ఇంకా వుంది)

డా॥ పి.వి.కె.రావ్. B.A. సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్. వైద్యాచార్య

హస్తప్రయోగం. నరముల బలహీనత. అంగము చిన్నదగుట. శీఘ్రస్కలనము. శుక్ల నష్టము. సుఖరోగములకుమానసికవ్యాధులకు శాస్త్రీయచికిత్స విదేశీ యంత్రములతో ప్రత్యేక చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్

టి. బి. రోడ్. తెనాలి. ఫోన్ 100.

SUVARNA